క్లుప్తంగా

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్ విద్యాసాగర్

కర్నూలు (న్యూటౌన్): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్ అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈపోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు తమ జట్టు గెలుపే లక్ష్యంగా ఆడాలని సూచించారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20,016, రెండో బహుమతి రూ.10,016 అందజేస్తామని అన్నారు.

స్పందనకు హాజరుకాకపోతే చర్యలు

సి.బెళగల్/గూడూరు: ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించేందుకు నేడు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులందరూ తప్పక హాజరు కావాలని, లేకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. మండల ప్రజలు ఏవైనా సమస్యలుంటే వాటిపై అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. గూడూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు.

ప్రజాసమస్యలపై పోరాటం



వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నబీ రసూల్

కోడుమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నబీ రసూల్ అన్నారు. ఆదివారం కోడుమూరులో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా నబీ రసూల్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ విధానాలతో కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని చెప్పారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, కనికె నాగిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపీని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. వైకల్యాన్ని జయించేందుకు ఫిజియోథెరపీ చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. సోమవారం ఈ కార్యక్రమాన్ని స్థానిక భవిత కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.


శివమాల స్వీకరణ

గూడూరు రూరల్: మండల పరిధిలోని బూడిదపాడు, కె.నాగలాపురం, పెంచికలపాడు, జూలకల్, మునగాల, చనుగొండ్ల, గూడూరుకు చెందిన భక్తులు ఆదివారం శివమాల స్వీకరించారు. ముందుగా వారు ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

13 నుంచి కబడ్డీ పోటీలు

ఆస్పరి: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆస్పరి యూత్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు రామకృష్ణ, మహేశ్ తదితరులు ఆదివారం విలేకరులకు తెలిపారు. పోటీల్లో విజేత జట్టుకు రూ.20,116, రన్నర్‌కు రూ.10,116, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5,116 అందిస్తారన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 11వ తేదీ లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99129 51780, 77020 57770 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు

ప్రశాంతంగా గ్రూప్‌-1 ప్రిలిమ్స్



పరీక్ష రాసి బయటకొస్తున్న అభ్యర్థులు

పాణ్యం: గ్రూప్‌-1 ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పాణ్యం మండలంలో ఆర్‌జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. పాణ్యం సీఐ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పోలీసులు రెండు కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు. ఆర్‌జీఎం కాలేజీ సెంటర్‌లో మొత్తం 750 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 570 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. అలాగే శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో 554 మంది గాను 171 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు.

ట్రాఫికర్!

- గడివేములలో వేధిస్తోన్న ట్రాఫిక్ సమస్య
- నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాల రాకపోకలు
- జిందాల్ పరిశ్రమ వాహనాలు సైతం ఇటు వైపే
- ప్రధాన రహదారిలో స్తంభిస్తున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, ప్రయాణికులు

గడివేముల: మండల కేంద్రం గడివేములలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఊరిలో భారీ వాహనాలు తిరుగుతున్నాయి. ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో వాహనాలు ఎదురైనప్పుడు ట్రాఫిక్ జామ్ అయి వందల కొద్ది వాహనాలు నిలిచిపోతున్నాయి.దీనికి తోడు కొందరు రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో వెళ్లేందుకు మరో మార్గం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల మీద మండల కేంద్రానికి వచ్చిన చుట్టుపక్కల గ్రామస్తులు కూడా గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. పాతబస్టాండ్ ప్రాంతంలో భారీ వాహనాల కిందపడి మరణించిన సంఘటనలూ ఉన్నాయి. దీంతో స్థానికులు గ్రామంలోకి భారీ వాహనాలు రాకుండా గతంలో అడ్డుకున్నారు. దీంతో కొద్ది రోజుల పాటు ట్రాఫిక్ సమస్య ఉండేది కాదు. ఇప్పుడు మళ్లీ భారీ వాహనాలు గ్రామంలోకి వస్తుండటంతో సమస్య మొదటికొచ్చిందని వారు వాపోతున్నారు.

ఆక్రమణలకు గురైన రహదారి

స్థానిక సినిమాహాలు వద్ద నుంచి జెడ్పీ హైస్కూలు వరకు రోడ్డు వెంట అక్రమ కట్టడాలు వెలిశాయి. దీంతో రహదారి ఇరుకుగా మారింది. దీనికితోడు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి హైస్కూల్ వరకు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆ షాపుల వద్ద ఇష్టం వచ్చినట్లు వాహనాలు ఆపడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.

భారీ వాహనాలకు సమయమేదీ ?

గతంలో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటలకు మాత్రమే భారీ వాహనాలకు అనుమతి ఉండేది. దీంతో పగటి సమయంలో రాకపోకలకు ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా జిందాల్ ఫ్యాక్టరీకి సంబంధించిన భారీ వాహనాలు ఊరిలోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం తమ వాహనాల రాకపోకలకు పరిశ్రమ నుంచి నంద్యాల వెంకటేశ్వరపురం వరకు సీసీ రోడ్డు వేసింది. జిందాల్ వాహనాలు ఈ రోడ్డుపైనే వెళ్లాలి. అయితే, కొంత మంది ట్రాన్స్‌పోర్టు యజమానులు డీజిల్ ఆదా కోసం గడివేముల మీదుగా భారీ వాహనాలు నడుపుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో పాటు రోడ్డు దెబ్బతింటోందని గ్రామస్తులు వాపోతున్నారు.



గడివేముల పాతబస్టాండ్‌లో ట్రాఫిక్‌జామ్



ఉత్తుత్తి హెచ్చరికే..భారీ వాహనాలకు ప్రవేశం లేదని బూజునూరుబాట వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డు

భారీ వాహనాలను మళ్లించాలి



మండల కేంద్రమైన గడివేములలో నిత్యం భారీ వాహనాలు వస్తుండటంతో బూజునూరు గ్రామం నుంచి గడివేములకు వెళ్లే రహదారి దెబ్బతిన్నది. దీనికితోడు ట్రాఫిక్ జామ్ కూడా అవుతుంది. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. భారీ వాహనాలు ఊరిలోకి రాకుండా బైపాస్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. **–చిన్నషాలు,బూజునూరు గ్రామం**

జిందాల్ వాహనాలతో ట్రాఫిక్ జాం



జిందాల్ ఫ్యాక్టరీకి సంబంధించిన భారీ వాహనాలు గడివేములలోకి రాకుండా అరికట్టాలి. లేకపోతే వాటికి రాత్రిపూట మాత్రమే అనుమతించాలి. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో పాటు ట్రాఫిక్‌జామ్‌తో రోజూ ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇప్పటికే భారీ లారీల రాకపోకలతో దుమ్ము పెరిగి రోగాలబారిన పడుతున్నాము. **–గఫూర్,గడివేముల**

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



గడివేములలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. పాత బస్టాండ్ ప్రాంతంలో నిత్యం ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తాను. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘిస్తే జరిమానాలు విధిస్తాం. అలాగే భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడుతాం. **–బీటీ వెంకటసుబ్బయ్య, గడివేముల ఎస్‌ఐ**

దేశ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని మాజీ ఎమ్మెల్యే, ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నార. 21వ జాతీయ స్థాయి సాంస్కృతిక మేళాలో భాగంగా ఆదివారం కృష్ణానగర్ రైల్వే గేట్ సమీపంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జాతీయ స్థాయి ఆధునిక నృత్య పోటీలు జరిగాయి. పోటీలను ప్రారంభించిన ఎస్వీ మోహన్‌రెడ్డి.. మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన కళా నైపుణ్యాలను వెలికి తీసి ప్రోత్సహించేందుకు పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారు వివిధ రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. కర్నూలు నగర డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న మానసిక ఒత్తిడి తగ్గించడానికి సాంస్కృతిక పోటీలు ఉపయోగ పడతాయన్నారు. కళా ప్రతిభను ప్రదర్శించడానికి ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ చక్కని వేదికను ఏర్పాటు చేసిందన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు ఎస్వీ విజయమనోహరి, ఎస్వీ జనక్ దత్తారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. ఎస్వీ సుబ్బారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు తమ నృత్య కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి నాగలక్ష్మి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ రాఘవేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్స్ సంఘం నూతన అధ్యక్షుడిగా శివరామ్‌గౌడ్

- గౌరవాధ్యక్షుడిగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



నూతనంగా ఎన్నికైన కర్నూలు కేబుల్ ఆపరేటర్స్ సంఘం సభ్యులు

కర్నూలు (టౌన్): కేబుల్ ఆపరేటర్స్ సంఘం నూతన అధ్యక్షుడిగా శివరామ్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానికంగా ఒక హోటల్‌లో కర్నూలు కేబుల్ ఆపరేటర్స్ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన సంఘం గౌరవాధ్యక్షుడిగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వ్యవహరిస్తారు. సందడి సుధాకర్ (వర్కింగ్ ఉపాధ్యక్షులు), సోమేష్, ఖాదర్‌బాషా, రత్నం (ఉపాధ్యక్షులు), శ్రీరామ్ (కార్యదర్శి), నాగరమణ, రాజు (సంయుక్త కార్యదర్శి), రమేష్ (కోశాధికారి) కార్యవర్గ సభ్యులుగా ప్రకాష్, శ్రీనివాసులు, శంకర్, జితేందర్, జనార్దన్, వెంకటేష్ యాదవ్, లక్ష్మీనారాయణ, నాగిరెడ్డి, ప్రసాద్, రాంమోహన్‌ను ఎన్నుకున్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలి



రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్న జిల్లా షూటింగ్ బాల్ జట్టు

కర్నూలు (టౌన్): ఈ నెల 14వ తేదీ కృష్ణా జిల్లా విజయవాడ పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు అతిథులుగా హాజరైన వీరిరువురు క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులుగా ప్రతిభ చాటే వారికి ప్రభుత్వం నుంచి మంచి ప్రోత్సాహం ఉందన్నారు. కార్యక్రమంలో షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, నాగరాజు, పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిలో జాగ్రత్తలు తీసుకోండి



మాట్లాడుతున్న విశ్రాంత వ్యవసాయ అధికారి రామరాజు

కర్నూలు(అగ్రికల్చర్): విత్తనోత్పత్తిలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని నంద్యాల ప్రాంతీయ పరిశోధన కేంద్రం విశ్రాంత వ్యవసాయ అధికారి రామరాజు తెలిపారు. ఆదివారం ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సు కింద నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన విత్తనోత్పత్తి, విత్తన ధ్రువీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలంటే విత్తనం ఎంపిక కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. విత్తనోత్పత్తికి మూల(బ్రీడర్) విత్తనం వాడాలని, దీని నుంచి ఫౌండేషన్ సీడ్ వస్తుందని తెలిపారు. విత్తనోత్పత్తికి ఫౌండేషన్ సీడ్ వినియోగిస్తే దాని నుంచి సర్టిఫైడ్ సీడ్ వస్తుందన్నారు. విత్తనంలో జన్యు స్వచ్ఛత, తేమ తగిన స్థాయిలో ఉండాలని పేర్కొన్నారు. విత్తన ఉత్పత్తిలో ఐసోలేషన్ దూరం, కలుపు యాజమాన్యం తదితర వాటిని పాటించాలని సూచించారు. రైతులకు విత్తనోత్పత్తిపై తగిన అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌పుట్ డీలర్లతో పాటు దేశీ శిక్షణా కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య పాల్గొన్నారు.

నేడు ఈ తాండ్రపాడులో గడప గడపకు..

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని ఈ తాండ్రపాడు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ భాస్కర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరై ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు.

అమ్మవారి ఆదాయానికి గండి

- కె. నాగలాపురం సుంకులమ్మ గుడిలో ఇష్టారాజ్యం
- అమలు కాని దేవదాయశాఖ ఉత్తర్వులు
- ఆర్జిత సేవల టికెట్లకు అడ్డుపడుతున్న స్థానిక నాయకులు, పూజారులు



కె.నాగలాపురంలో సుంకులాపరమేశ్వరి దేవాలయం

గూడూరు రూరల్: వేలల్లో భక్తులు లక్షల్లో ఆదాయం వస్తున్నా ఆ దేవాలయం ఆశించిన మేర అభివృద్ధికి నోచుకోవడం లేదు. చివరకు స్థానిక నాయకుల తీరుతో గుడి ఆదాయానికి సైతం గండి పడుతోంది. కె.నాగలాపురంలోని సుంకులాపరమేశ్వరీదేవి గుడి దేవదాయశాఖ పరిధిలో ఉంది. ఈ ఆలయానికి కార్యనిర్వహణాధికారితో పాటు పాలక మండలి ఉంది. ప్రతి మంగళ, శుక్రవారాల్లో అమ్మవారి దేవర జరుగుతుంది. ఆయా రోజుల్లో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది వచ్చి అమ్మవారిని దర్శించుకుని చీరెలు, జాకెట్లు, బియ్యం, బ్యాళ్ల తదితర వస్తువులు అందిస్తారు. అయితే, ఆ వస్తువులను గుడిలో భద్రపరచకుండా పూజారులు తమ ఇళ్లకు తీసుకెళ్తున్నారు. అమ్మవారికి పూజ, కుంకుమార్చన, వాహన పూజలు వంటివి చేసినా ఆ సొమ్ము పూజారుల జేబులోకే వెలుతోందనే ఆరోపణలున్నాయి. 2019లో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ అమ్మవారి గుడికి సంబంధించి స్పెషల్ దర్శనానికి రూ. 20, వీఐపీ దర్శనానికి రూ. 100, అర్చనకు రూ. 20, కుంకుమార్చన రూ. 200, ఆకుపూజ, గండ దీపానికి రూ. 200, వస్త్రాలంకరణకు రూ. 50, ఉత్సవ విగ్రహం అభిషేకానికి రూ.216, వాహనపూజకు (నలుగు చక్రాలు)రూ. 200, మూడు చక్రాల పూజకు రూ. 100, రెండు చక్రాల వాహనానికి రూ. 50, లడ్డు ప్రసాదం(100 గ్రాములు)రూ.15, పులిహోర (200 గ్రాములు) రూ.15 చొప్పున ఆర్జిత సేవ రుసుంలు అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, దీనిని అమలు చేసేందుకు స్థానిక నాయకులు, పూజారులు అడ్డుపడి గుడి ఆదాయానికి గండికొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం భక్తులు హుండీలలో వేసే కానుకల ద్వారానే ఏడాదికి రూ. 60 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. అదే ఆర్జితసేవా టికెట్లను ఏర్పాటు చేస్తే మరో రూ. 50 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. జిల్లా దేవదాయశాఖ, జిల్లా కలెక్టర్ స్పందించి గుడి అభివృద్ధి, ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

నగరంలో అగ్ని ప్రమాదం

రూ.6 లక్షల ఆస్తి నష్టం

కర్నూలు (టౌన్): నగరంలోని వెంకటరమణ కాలనీ సమీపంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అక్కడే ఉన్న కొట్టంతో పాటు పక్కనే ఉన్న కారు పూర్తిగా కాలిపోయింది. మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అగ్ని మాపక శాఖ అధికారులు ఏడీఎఫ్‌ఓ చిన్నబజారి, భాస్కర్‌రెడ్డి, ఫైర్‌మెన్ రవీంద్రనాథ్, హోంగార్డులు మహేష్, హనుమంతులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంపై ఆరా తీశారు. ఉద్దేశ పూర్వకంగానే గుర్తు తెలియని వ్యక్తులు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మరింత దర్యాప్తు చేస్తున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. అలాగే నగర పరిధిలోని శరీన్‌నగర్ సమీపంలోని వెంకటాద్రినగర్‌లో గడ్డివాము అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనలో రూ.30 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

21న గానాల రామమూర్తి జయంతి

కర్నూలు(అర్బన్): ఈ నెల 21వ తేదీన బ్రహ్మశ్రీ రావుసాహెబ్ పండిత గానాల రామమూర్తి 131వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు బీసీ నేతలు తెలిపారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన జయంతి సన్నాహక సమావేశంలో నేతలు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మికాంతయ్య, పార్వతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామమూర్తి జయంతిని రాజకీయాలకు అతీతంగా విశ్వ బ్రాహ్మణులు ఐకమత్యంగా జరుపుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఉత్సవ కమిటీ కన్వీనర్లుగా వడ్ల శ్రీనివాసులు, సుమంత్ ఆచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మగ్గం వర్క్‌తో మహిళలకు ఉపాధి

కర్నూలు(అర్బన్): నగరంలోని పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన మహిళలకు కంప్యూటర్ ద్వారా మగ్గం వర్క్‌పై ఉపాధి పొందేందుకు శిక్షణ ఇస్తున్న ట్లు రాజ్‌కుమార్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు రత్నకుమారి తెలిపారు. స్థానిక అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని తమ కార్యాలయంలో ఈ శిక్షణను ఇస్తున్నట్లు ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మగ్గం వర్క్‌తో పాటు బ్యూటీషియన్ కోర్సు, కుట్టుమిషన్ నేర్పించడం జరుగుతుందన్నారు. కనీస ఫీజుతో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన మహిళలు మరిన్ని వివరాలకు సెల్: 7569325354 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

20 నుంచి భక్తి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర 5వ భక్తి సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.జి.శరత్ చంద్రబాబు తెలిపారు. వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో 20 నుంచి 22వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే సమ్మేళనంలో 18 మంది స్వామీజీలు, రాష్ట్రంలో ఉన్న రామకృష్ణ సేవా సమితిల ప్రతినిధులు, సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ సమ్మేళనానికి కన్వీనర్‌గా శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ (ఎస్‌ఆర్‌కేవీబీపీపీ) రాయలసీమ కన్వీనర్ డాక్టర్ పి.పి.వి.డి. నాగత్రిశూల పాణి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



అర్చకుడికి నగదు అందిస్తున్న దాతలు

పాణ్యం: కొత్తూరు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు ఆదివారం దాతలు విరాళం అందించారు. నంద్యాల పట్టణానికి చెందిన దండే పెద్ద వెంకటసుబ్బయ్య, వెంకట సుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు దండే శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు రూ.77,777 నగదును ప్రధాన అర్చకుడు నారాయణస్వామికి అందించారు. ప్రస్తుతం ఆలయంలో మహాప్రాకారం, భక్తులు సౌకర్యార్థం ప్రత్యేక విడిది ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు అర్చకుడు తెలిపాడు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సి.బెళగల్ కస్తూరిబా విద్యార్థినులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని కస్తూరిబా బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు స్రవంతి, చిన్నారి, శశిరేఖ, రాజేశ్వరి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు, షాదీహాన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 7న కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వారు ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ఎస్‌ఓ జ్యోతి ఆదివారం తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ విద్యార్థినులు పాల్గొంటారని ఆమె వెల్లడించారు.



పెరిగిన జొన్న సాగు

కంబదహాల్ దగ్గర సాగు చేసిన జొన్న పంట

సి.బెళగల్: మండలంలో ఈసారి జొన్నపంట సాగు విస్తీర్ణం పెరిగింది. గతేడాది రబీలో కేవలం 11.6 హెక్టార్లలో జొన్నపంట సాగవగా, ఈ సారి 66.12 హెక్టార్లకు పెరిగింది. అత్యధికంగా కంబదహాల్‌లో 65.53 ఎకరాలు, బురాన్‌దొడ్డిలో 30.06, సి.బెళగల్‌లో 20.44, పోలకల్‌లో 18.23, గుండ్రేవులలో 11.97, కొండాపురంలో 10.19, బ్రాహ్మణదొడ్డిలో 6.96 ఎకరాల్లో పంట వేశారు. వాతావరణం అనుకూలించడంతో ప్రస్తుతం జొన్న పైర్లు కళకళలాడుతున్నాయి.

జిల్లా వాసికి విశిష్ట పురస్కారం



ప్రముఖుల చేతుల మీదుగా తెలుగు తేజం జాతీయ విశిష్ట పురస్కారం అందుకుంటున్న మద్దిలేటి

కర్నూలు కల్చరల్: తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా పుడమి సేవా సంస్థ కర్నూలు నగరానికి చెందిన డాక్టర్ ఎస్.కె.మద్దిలేటికి తెలుగు తేజం జాతీయ విశిష్ట పురస్కారం ప్రదానం చేసింది. సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా నల్లగొండలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవుల వారసులు సాహితీ వేత్తలు డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మ, కంచర్ల శ్రీనివాస రావు, మున్నెల్లి శివశంకరయ్య, గిడుగు వెంకట నాగేశ్వరరావు, డాక్టర్ ఏనుగు శివరామ ప్రసాద్‌ల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. పురస్కారం అందుకున్న మద్దిలేటికి పలువురు సాహితీ వేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.